

వీధి బాలల గుర్తింపునకు ప్రత్యేక చర్యలు



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -పాడేరు: గాంధీ జయంతి పురస్కరించుకొని ఈనెల 2 నుంచి ప్రారంభించిన వీధి బాలల గుర్తింపు ప్రక్రియను ఈ నెల 10వరకు నిర్వహించనున్నట్లు సహాయ కార్మికశాఖ అధికారి పి సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఐసిడిఎస్, పోలీసు సిబ్బందితో కలిసి, పాడేరులోని అన్ని డిపార్ట్‌మెంట్ స్టోర్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ, ఎక్కడైనా వీధి బాలలు, అనాథ పిల్లలు కనిపిస్తే ఐసిడిఎస్ సూపర్‌వైజర్,లేదా సహాయ కార్మిక అధికారులకు తెలియపరస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. 14ఏళ్లు నిండని బాలలతో పనిచేయించడం, పనులకు ఉపయోగించడం చట్టరీత్యా నేరమని, బాధ్యులైన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

'జగనన్న చెబుదాం'లో కలెక్టర్ సుమిత్ కుమార్
334 అర్జీల స్వీకరణ



ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు

ప్రజాశక్తి హుకుంపేట: ప్రభుత్వపాలనను ప్రజలకు చేరువ చేయడం, సమస్యలను తెలుసుకుని పరిష్కరించడంతోపాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం హుకుంపేట మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాస్, ఐటిడిఎ పిఒ అభిషేక్, ఇతర జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా 334 వినతులు రాగా, వాటిలో అధిక శాతం రెవిన్యూ, భూ సమస్యలు, రహదారులు, పించన్లు, ఉపాధి కల్పన, పోడుపట్టాలపై దరఖాస్తులు వచ్చాయి.

ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారంపై ఎంతో ఆశతో ప్రజలు అర్జీలను ఇచ్చారని, వారి నమ్మకం వమ్ముకాకుండా ప్రతి సమస్యపరిష్కారానికి జిల్లా యంత్రాంగం కృషి చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రతి సమస్యపై విచారణ అధికారిని నియమించి సకాలంలో పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా శారీరక, మానసిక వికలాంగుడైన తమ బిడ్డ వంత లబుజ్జిబాబుకు వికలాంగ పింఛను మంజూరు చేయాలని సూకూరు పంచాయతీ, బిరిసింగ్ గ్రామానికి చెందిన వంతల పొట్టమ్మ వినతిపత్రం అందజేసింది. పుట్టిన నుంచి కాళు చేతులుచచ్చుబడి, మాటలు రాని తమ బిడ్డకు వికలాంగ పింఛను ఇవ్వాలని ముంచింగిపుట్ మండలం, జోలాపుట్ పంచాయతీ కులబెరు గ్రామానికి చెందిన కొర్ర ఉప్పమ్మ, అలాగే మూగ, నడవలేని వికలాంగుడైనతన బిడ్డ గుండ్ల పండు (16) కు పింఛను ఇప్పించాలని చింతపల్లి మండలం, తాజంగి గ్రామానికి చెందిన గుండ్ల మంగ కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. డిగ్రీ, ఐటిఐ పూర్తి చేసిన తర్వాత జరిగిన ప్రమాదంలో రెండుకాళ్లు పోగొట్టుకున్న తనకు ఉద్యోగం, ఉపాధి కల్పించాలని రంగశీల పంచాయతీ, ఒంటిపాక గ్రామానికి చెందిన గంజాయి బాలరాజు మొరపెట్టుకున్నాడు. 11నెలల పాటుగ ర్భిణులకు భోజనాలను పెట్టిన తమకు రూ.95,220 భోజనబిల్లు బకాయి ఐటిడిఎ చెల్లించాల్సి ఉందని సత్యనారాయణ స్వామి స్వయం సహాయక సభ్యురాలు కె. లక్ష్మి విన్నవించారు. మండల కేంద్రంలో అపారిశుధ్యంపై సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ విన్నవించారు. పనసపుట్టు జిటిడబ్ల్యూఎ స్కూలులో అటెండర్ పోస్టుకు నియామకం కోరుతూ ముంచింగిపుట్ మండలం, పనసపుట్టు పంచాయతీ టిక్రపడకు చెందిన పి. సునీత అర్జీ అందజేశారు. మూడేళ్ల క్రితం తన భూములను సర్వేచేసినా ఇంకా పోడుపట్టా ఇవ్వలేదని బాకూరు గ్రామానికి చెందిన బాకూరు వెంటకట రామరాజు విన్నవించారు. తీగలవలస పంచాయతీ పరిధి కామయ్యపేటలో మినీ ఆరోగ్యకేంద్రం మంజూరు చేయాలని తీగలవలస ప్రజలు విన్నవించారు.





వికలాంగ బిడ్డలను తీసుకొచ్చి, పింఛను మంజూరుకు మొరపెట్టుకున్న తల్లిదండ్రులు

గిరిజనంలో చైతన్యానికి చర్యలు

మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో పోలీసుల విస్తృత పర్యటన



గిరిజన బాలలకు చాక్లెట్లు ఇస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్, పోలీసులు

ప్రజాశక్తి - పెదబయలు : మండలంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని గిరిజనులకు మంచీచెడులను వివరించడంతోపాటు వారిలో చైతన్యానికి చర్యలు చేపట్టినట్లు స్థానిక ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. నాలుగు రోజులపాటు మండలంలోని సాకిరేవు, కొత్తూరు, జామిగూడ, కెందుగూడ, మెత్తగూడ, కొజ్జారిగూడ, సోరిజిగూడ, జడిగూడ, గబ్బర్ల, చింతలవీధి, గుంజివాడ పిట్టలబొర్రా, చేమగెడ్డ, గబ్బర్ల మామిడి తదితర మావోయిస్టు ప్రభావిత గ్రామాలలో పోలీసుసిబ్బందితో కలిసి విస్తృత పర్యటన చేశారు. ఈ సందర్భంగా పెదబయలు స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లోని ప్రజలకు గంజాయి సాగువైపు మొగ్గకుండా చైతన్యపరిచారని, గంజాయికి బదులు ప్రత్యామ్నాయ పంటల సాగు,దానికి ప్రభుత్వపరంగా అందిస్తున్న ప్రోత్సాహంపై వివరించామన్నారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని, ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు, రాయతీ రుణాలనుసద్వినియోగం చేసుకోవాలని సూచించామన్నారు. వాణిజ్య పంటలు పండించి ఆదాయవనరులు సమాకుర్చుకోవాలని వివరించారు. ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై మన్యవాసులకు అవగాహన కల్పించామన్నారు. గిరిబాలలకు చాక్లెట్లు, యువతక వాలీబాల్ కిట్లు, అలాగే సీజనల్ జ్వరాలకు అవసరమైన మందులు అందజేశామన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం : పిఒ



పరీక్షలను పరిశీలిస్తున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి -పాడేరు: పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధనే లక్ష్యంగా నాణ్యమైన బోధన అందిస్తామని ఐటిడిఎ పిఒ వి. అభిషేక్ అన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించడానికి విద్యార్థుల గుర్తింపునకు శుక్రవారం లోచలిపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల -1, శ్రీకృష్ణాపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో రాత పరీక్ష నిర్వహించారు. రాత పరీక్ష విధానాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ వి. అభిషేక్ పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. పాడేరు డివిజన్ పరిధిలోని 107 ఆశ్రమ పాఠశాలల నుండి 305 మంది విద్యార్థులు రాత పరీక్షకు హాజరయ్యారని తెలిపారు.. లోచలిపుట్టు పాఠశాలకు 183 విద్యార్థులకు 172 మంది హాజరయ్యారని, శ్రీకృష్ణాపురం పాఠశాలకు 138 మందికి 133 మంది బాలికలు పరీక్షకు రాశారన్నారు. కార్యక్రమంలో సహాయ గిరిజన సంక్షేమాధికారి ఎల్.రజని పాల్గొన్నారు.

రిటైర్డ్ అంగన్వాడీలకు ఘనసత్కారం



అంగన్వాడీలను సత్కరిస్తున్న యూనియన్ నేతలు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:అంగన్వాడి కేంద్రలో కొన్నేళ్లు సేవలందించి, ఉద్యోగ విరమణ పొందిన పెదలబుడు పంచాయతీ శరభగుడ అంగన్వాడీ కార్యకర్త మాయాదేవి, లోతేరు పంచాయతీ పెదవలస హెల్పర్ మొతి, కొత్తవలస, అరకువేలీ, రణజిల్డా అంగన్వాడీ టీచర్లు హసీనా బేగం, సీతమ్మ, రోజా పుష్పలను సత్కరించారు.

శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ విరమణ అభినందన సభలో వారి సేవలను కొనియాడారు. పుష్పగుచ్ఛాలను అందజేసి, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రభుత్వపరంగా వారికి రావాల్సిన బెనిఫిట్స్‌ను తక్షణం చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగమ్మ, వెంకట లక్ష్మీ, భారతి, లక్ష్మి, నిర్మల పాల్గొన్నారు.

ఆటో బోల్తా : గిరిజనుడు దుర్మరణం

బంధువు దహన సంస్కారాలకు వెళ్తుండగా ఘటన



మృతుడు సూకూరు సుబ్బారావు

ప్రజాశక్తి- పెదబయలు రూరల్ : బంధువు అంత్యక్రియలకు వెళ్తూ ఆటో బోల్తా పడిన దుర్ఘటనలో గిరిజనుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మేనత్త మరణవార్త విని, కడసారి చూపులు, అంత్యక్రియలకు వెళుతూ, అల్లుడు సుకూరు సుబ్బారావు మృత్యువాత పడడంపై విషాదఛాయలు అలుముకున్నాయి ఘటనకు సంబంధించి ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ చెప్పిన వివరాలివి.

మండలంలోని పర్రెడ పంచాయతీ రూడగోమంగి ఘాటీ మలుపు వద్ద బ్రేకు పెయిల్ కావటంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముంచంగిపుట్టు మండలం కిలగడ పంచాయతీ, చెరుపాకలు గ్రామస్తుడు సుకూరు సుబ్బారావు(57) మృత్యువాత పడ్డాడు. దూలిపుట్టు గ్రామంలో మృతుడు సుకూరు సుబ్బారావు మేనత్త చనిపోవడంతో అంతిమచూపు, దహన సంస్కారాలకు కుటుంబసమేతంగా ఆటోలో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో ఆటోలో 15 మంది ఉన్నారు. వీరిలో మూడునెలల బాబు, మూడేళ్ల బాలిక ప్రాణాలతో బయటపడ్డారు. ఒక మహిళ కుడిభుజం విరిగిపోయింది.

తక్షణమే స్థానికులు స్పందించి గాయపడిన వారిని రూడకోట పిహెచ్‌సికి తరలించారు. తీవ్రగాయాలతో ఆరోగ్యం విషమంగా ఉన్న సుబ్బారావను ముంచంగిపుట్టు పిహెచ్‌సికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే మృత్యువాత పడ్డాడు తొమ్మిది మంది క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

సిపిఎం నాయకులు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్

ప్రజాశక్తి-చింతూరు

మండల కేంద్రం చింతూరు పంచాయతీ పరిధి అల్లిగూడెం గ్రామంలో మంచినీటి బోరు ప్యానెల్ బోర్డుకు మరమ్మతుల నిర్వహించి మంచినీటి బోరును రిపేర్ చేయించి గ్రామ ప్రజలకు తాగునీటిని అందించాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ డిమాండ్ చేశారు. అల్లిగూడెం గ్రామంలో శుక్రవారం జరిగిన సమావేశంలో గ్రామంలో నెలకొన్న మంచినీరు, వీధి రోడ్లు, వీధిలైట్లు, ఆదివాసీలు సాగు చేస్తున్న భూములకు హక్కు పత్రాలు తదితర సమస్యలు గ్రామస్తులు తెలియజేశారు. అనంతరం సీసం సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తాగునీరు, రోడ్లు, వీధిలైట్లు వంటి కనీస మౌలిక వసతులను కల్పించలేదని స్థితిలో ఉందని పేర్కొన్నారు. అల్లిగూడెంలో వాటర్ ట్యాంక్ మోటర్ పాడైపోయిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి రెండు నెలలు కావస్తున్నా నేటికీ ఎలాంటి పరిష్కారం చూపలేదన్నారు. గ్రామంలోని అంతర్గత రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయని, వీధిలైట్లు ఏడాదిగా వెలగకపోయినా ఏ ఒక్క అధికారీ పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పై సమస్యలను పరిష్కరించాలని, ఆదివాసీలకు కులం సర్టిఫికెట్లు మంజూరు చేయాలని, సాగు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ముర్రం, రంగమ్మ, పోడియం లక్ష్మణ్, గ్రామస్తులు కూర భీమయ్య, మడకం లక్ష్మణ్, ఆనంద్, కూర లక్ష్మణ్, దేవయ్య, వంగయ్య, కిషోర్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని విద్యార్థులు జాతీయస్థాయి ఆటల పోటీలో పాల్గొనే విధంగా ఐటిడీఏ ప్రోత్సహించడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. మహారాష్ట్ర నాసిక్‌లో సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 10వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి క్రీడల పోటీల్లో ఎపి నుండి జిల్లా రంపచోడవరం ఐటిడీఏ పరిధిలోని రంపచోడవరం మండలం బందపల్లి బాలురు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కోసు లోకేష్ దొర, 8వ తరగతి చదువుతున్న సిహెచ్ కళ్యాణ్ రావు దొర డబల్ డచ్ స్పీడ్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. సదరు విద్యార్థులకు శుక్రవారం పిఒ సూరజ్ గనోరే తన ఛాంబర్‌లో సబ్ కలెక్టర్ శుభం బన్సల్ కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి గనోరే మాట్లాడుతూ స్పోర్ట్స్‌పై మక్కువ ఉన్న విద్యార్థులకు ప్రతిరోజూ ఏ రకమైన ఫుడ్ అందజేయుచున్నది సంబంధిత ఉపాధ్యాయులను ప్రాజెక్ట్ అధికారి అడిగి తెలుసుకున్నారు. ఈ పోటీల్లో పాల్గొని విద్యార్థులకు ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయలు ఆర్థిక సహాయం కూడా అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్, ఎటీడబ్ల్యుఒ రామ తులసి, ప్రధానోపాధ్యాయులు యం.రాములు, ఫిజికల్ డైరెక్టర్ కె. తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

మల్లుదొర, గంటందొర విశ్వవిద్యాలయంగా నామకరణం చేయాలి

ప్రజాశక్తి-కొయ్యూరు

కేంద్రీయ విశ్వవిద్యాలయానికి మల్లు దొర, గంటందొర విశ్వవిద్యాలయం అని నామకరణం చేయాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం నాయకులు శ్యామల వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్లూరి జిల్లాలో వస్తున్న కాలేజీలకు స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు పెడితే బాగుంటుందని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణ త్యాగాలు చేసిన వారు అల్లూరి జిల్లాలో అనేక మంది ఉన్నారని, వారి గౌరవార్థం వారి పేర్లు పెట్టాలని కోరారు. తెలంగాణలో ఏర్పాటు చేస్తున్న విశ్వవిద్యాలయానికి సమ్మక్క సారక్క అని నామకరణం చేస్తున్నారని, ఇలాగే ఇక్కడ మల్లుదొర, గంటందొరగా నామకరణం చేయాలని కోరారు.

పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి-మోతుగూడెం

అల్లూరి జిల్లా, వై రామవరం మండలం డొంకరాయి పరిధి రెడ్డినగర్ గ్రామంలో ఎస్సై శివ కుమార్, స్టేషన్ సిబ్బంది శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా, నిషేధిత గంజాయి సాగు, నాటు సారా తయారీ, విక్రయం వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు, క్షుద్ర పూజలు, విద్యుత్‌ని ఉపయోగించి జంతువుల వేట, చదువు ప్రాధాన్యత వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సంద్భంగా ఎస్సై శివ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో పంట చేతికి వచ్చే సమయానికి పంట నాశనం చేయడానికి వచ్చే అడివి పందులను వేటాడటానికి కరెంట్ తీగలు ఉపయోగించి చంపడానికి ప్రయత్నం చేస్తారని, కొన్ని సందర్భాల్లో జంతు నష్టంతో పాటు మనుషుల ప్రాణ నష్టం కూడా వాటిల్లుతుందని, అలాంటి పనులు ఎవరైనా చెస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు మధు, కళ్యాణ్, పోసయ్యా పాల్గొన్నారు.



వడ్డిగూడెంలో యువకులతో మాట్లాడుతున్న ఎస్ఐ

విఆర్.పురం : విఆర్.పురం స్టేషన్ కొత్తగా వచ్చిన ఎస్ఐ వడ్డిగూడెం గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. యువత చెడు వ్యసనాలకి బానిస అవకుండా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లర్చిన నీటిని తాగాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడలని సూచించారు.

8లోగా రైతులు ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని ఇప్పటి వరకు పంట నమోదు, పంటబీమా ఈకేవైసీ చేయించుకోని వారు ఉంటే ఈ నెల 8వ తేదీ లోగా రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి కచ్చితంగా చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి రఘుకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ చేయించుకోవడానికి ఉదయం 6 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే యాప్ పని చేస్తుందని పేర్కొన్నారు. మండలంలో మొత్తం 1153 మంది రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాలలో ఇప్పటి వరకు నమోదు చేసుకున్నారని, ఇంకా 301 మంది రైతులు చేయించుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఆర్‌బికెలో విఎఎ / విహెచ్‌ఎలు ఈకేవైసీ నమోదు చేస్తారని, 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు గడువు ఉందని, ఆ తరువాత అవకాశం లేదని, రైతులు దీనిని గమనించాలని కోరారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు



గుమ్మురేవులలో స్టాల్‌ను సందర్శించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి - సీలేరు

జికె.వీధి మండలం గుమ్మురేవుల గ్రామపంచాయతీ కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. 604 మంది రోగులకు దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డికె.హిమబిందు, నాగభూషణం, సీలేరు వైద్యాధికారి సౌమ్య, ప్రత్యేక వైద్య నిపుణులు దీపక్, అనిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఇందులో పాల్గొన్న జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి మాట్లాడుతూ ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డి పాపారావు, కార్యదర్శి శ్రీనివాసరావు, సర్పంచులు కమలమ్మ, నడిగట్ల రాజు, ఎంపీటీసీ సభ్యురాలు జ్ఞాన దీపిక, వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు బుజ్జి పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని ఆడాకుల గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, వైసీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులుతో కలిసి ఎంపీపీ బడుగు రమేష్ ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను వారు పరిశీలించారు. కంతారం పీహెచ్సీ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు.

చింతపల్లి : సంపూర్ణ పోషణతో ఆరోగ్యానికి రక్షణ ఉంటుందని ఎంపిడిఒ ఆశా జ్యోతి, సిడిపిఒ రమణి అన్నారు. మండలంలోని అంజలి శనివారం ఆశ్రమ మినీ గురుకులం ఆవరణలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి శివ ఆధ్వర్యంలో సర్పంచ్ పేట్ల రాజుబాబు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాళ్లను, వైద్యశిబిరంలో సేవలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపిపి సాగిన వెంగళరావు, వైద్యాధికారులు సుధా శారద, శివకుమార్, సావిత్రి, నీరజ, ఎంఇఒ బోడం నాయుడు, మినీ గురుకుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ బృఈందావతి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు గౌహరున్నీషా, సత్యవతి, సిపిఐ మండల కార్యదర్శి పేట్ల పోతురాజు, క్షయవ్యాధి నివారణవిభాగం సూపర్‌వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - హుకుంపేట: తాత్కాలిక ప్రయోజనాన్నిచ్చే సంక్షేమం కంటే, శాశ్వత లబ్ధిని చేకూర్చేలా ఏజెన్సీ లోని మారుమూల ప్రాంతాలఅభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలనికాంగ్రెస్ పార్టీ అల్లూరి జిల్లా నాయకులు సమ్మరెడ్డి బాలకృష్ణ అన్నారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లు అంటూ అధికార పార్టీ ఆర్భాటపు ప్రచారం చేస్తోందని, అయితే ఏజెన్సీలో అభివృద్ధి కనిపిస్తాయిలో జరగలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సమస్యలపైనా, గిరిజనుల హక్కుల చట్టాలపైనా ఎమ్మెల్యేలు, ఎంపీలు చట్టసభల్లో ప్రస్తావించాలని డిమాండ్ చేశారు.మన్యంలో విద్య, వైద్యం, రహదారులు, తాగునీటి కల్పనకు చర్యలు చేపట్టాలని కోరారు. మన్యంవాసుల మనుగడకుముప్పు వాటిల్లేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటూ, అమలుకు ఉపక్రమించడం దుర్మార్గమన్నారు.



ఎన్నికైన నూతన కమిటీతో కళాశాల యాజమాన్యం

గురుకుల కాలేజీ విద్యా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- చింతపల్లి : స్థానిక ఆంధ్రప్రదేశ్ గురుకుల ఆశ్రమ జూనియర్ కళాశాల విద్యాకమిటీ చైర్మన్‌గా షేక్ రఫీ ఏకగ్రీవంగా నియమితులైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ కెవి.రామేశ్వరం తెలిపారు. శుక్రవారం పాడేరు గురుకుల కళాశాలల కన్వీనర్, ప్రిన్సిపాల్ వై పారయ్య పర్యవేక్షణలో నిర్వహించిన తల్లిదండ్రుల కమిటీ ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ రఫీ, నాగమణి ఏకగ్రీవంగా నియమితులుకాగా, మరో ఐదుగురు సభఉయలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, నూతన విద్యా కమిటీతో సమావేశమైన పారయ్య మాట్లాడుతూ విద్యార్థులు, విద్యతోపాటు, క్రమశిక్షణ కలిగి ఉండే విధంగా అధ్యాపకులతో పాటు విద్యా కమిటీ బాధ్యత తీసుకోవాలన్నారు. గురుకులం నియమ, నిబంధనలను అనుసరించి విద్యా బోధన జరపాలని అధ్యాపకులకు సూచించారు. మెరుగైన ఉత్తీర్ణత సాధనకు కృషిచేయాలన్నారు.

ప్రజోపయోగ పనులు చేపట్టాలని నిర్ణయం

ప్రజాశక్తి - రావికమతం : ఉపాధిహామీ పథకం పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కవగుంట సర్పంచ్ దాసరిసూర్యకుమారి కోరారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామసభకు అధ్యక్షత వహించిన సర్పంచ్ మాట్లాడుతూ 2024-25 ఏడాదికి పనుల గుర్తింపు, ప్రణాళిక రూపకల్పనపై చర్చించారు. గామ అభివద్ధితోపాటు, జాబ్ కార్డు కలిగిన ఉపాధి కూలీలు వలసబాట పట్టకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. మట్టి రోడ్లు, పంటకాలువలు వంటి ప్రజోపయోగ పనులు చేపట్టాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి స్వామి మాట్లాడుతూ ఈ ఏడాది ఉపాధి నిధులతో రైతుల వ్యక్తిగత పనులను, సామాజిక పనులను,చెరువులు, కాలువలు, మట్టి రోడ్లు, కందకాలు, నీటి గుంటలు మొదలగు పనులను గుర్తించి, పంచాయతీ తీర్మానంతో అంచనా ప్రతిపాదనలను రూపొందించి నివేదిస్తామన్నారు. క్రార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మోహన్, వార్డు సభ్యులు సిహెచ్, రామనాయుడు, పద్మ, వర కుమారి, నాగేశ్వరరావు, వి చిన్న నాగరాజు, పి రాము పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు శ్రీ ప్రకాష్ విద్యార్థులు

ప్రజాశక్తి- పాయకరావుపేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో,విశాఖపట్నం పోర్ట్ స్టేడియంలో ఈనెల 4న నిర్వహించిన అండర్ -19 బాస్కెట్ బాల్ బాలుర, బాలికల జట్టు ఎంపిక పోటీలలో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బాలుర జిల్లా జట్టుకు బి.క్రాంతి, బాలికల జట్టుకు పి. శ్రీనిధి, కెవివి. లక్ష్మీ ప్రసన్న, ఆర్. శ్రీ రమావర్షిత ఎంపికయ్యారు. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో విశాఖ జిల్లా జట్టు తరపున పాల్గొంటారని శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వివిఎస్ఎస్. భానుమూర్తి తెలిపారు. బాస్కెట్‌బాట్ పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సిహెచ్‌వికె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, ఇన్‌ఛార్జి శ్రీలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు బాలరాజు, దుర్గబాబు అభినందించారు.

రూ.20 కోట్ల బిల్లులు చెల్లింపునకు క్లియరెన్స్

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ధన్యవాదాలు తెలిపిన కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో గత నెల 9వతేదీన రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కెఎస్. జవహర్ రెడ్డి పర్యటన జిల్లాకు సత్ఫలితాన్ని ఇచ్చిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడించారు. ప్రధాన కార్యదర్శి జిల్లాలో సమీక్ష అనంతరం ఇక్కడి భౌగోళిక పరిస్థితులు, గిరిజనుల ఇబ్బందులను గుర్తించి, ప్రాధాన్యేతర నిర్మాణాలకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపులకు రూ.20 కోట్లు విడుదల చేసారన్నారు. వెంటనే సంబంధిత పెండింగ్ బిల్లులు చెల్లించామని కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ప్రాధాన్యతేతర నిర్మాణాల బిల్లులు ఇప్పటివరకు రూ. 71 కోట్లు చెల్లించగా ప్రధాన కార్యదర్శి పర్యటన అనంతరం కేవలం 15 రోజులలో మరో రూ.20 కోట్లు విడుదల చేశారన్నారు. మిగిలిన బిల్లులకు నిధులను త్వరలో మంజూరు చేస్తారని ఆశా భావాన్ని కలెక్టర్ వ్యక్త పరిచారు. ఆ నిధులతో జిల్లాలో ముంచింగిపుట్టు, చింతపల్లి వై రామవరం లాంటి మండలాలలో మారుమూల ప్రాంతాలతోబాటు ముఖ్యమైన సీలేరు రహదారి పూర్తి చేశామన్నారు. ఏజెన్సీపై ప్రత్యేకదృష్టితో అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డికి కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిధులు లేవన్న సాకుతో ప్రాధాన్యత, ప్రాదాన్యతేతర నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు ఆపివేయవద్దని,ఎప్పటికప్పుడు బిల్లులను చెల్లిస్తామన్నారు.



ఏజెన్సీ పర్యటనలో సమీక్ష నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (ఫైల్)

ఇ-క్రాప్ నమోదు వేగవంతం

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు : ఇకెవైసి, ఇ క్రాప్ నమోదు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఐటిడిఎప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్లు, తాహశీల్దారులు, వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇక్రాప్ నమోదు, ఇకెవైసి, ఓటరు సవరణ ప్రక్రియ, భూముల రీసర్వే, కులధ్రువీకరణ పత్రాలు జారీపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతుకు పిఎం.కిసాన్ లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా వ్యవసాయాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. జిల్లాలో ఇకెవైసీ 88 శాతం పూర్తయ్యిందన్నారు. ఈ నెల 13వ తేదీలోగా శతశాతంపూర్తి చేయాలని ఆదేశించారు. ఇ క్రాప్ నమోదులో మరింత పురోగతి సాధించాలని స్పష్టం చేసారు. జి.కె. వీధి, పెదబయలు, అరకు వ్యాలీ మండలాల్లో ఆర్ఒఎఫ్ఆర్ భూముల డిజిటలైజేషన్ వేగంగా పూర్తి చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అడ్డతీగల మండలంలో పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లు వెంటనే పూర్తి చేయాలని తాహశీల్దారును ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా పూర్తి చేసి ముసాయిదా జాబితా తయారీకి సిద్ధం కావాలని స్పష్టం చేసారు. రీసర్వే లక్ష్యాలను నిర్దేశించిన గడవులోగా పూర్తి చేయాలని సూచించారు. కులధ్రువీకరణల జారీ మరింత త్వరగా చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె. శివశ్రీనివాసు, పాడేరు, రంపచోడం ఐటిడిఎ పిఒలు వి. అభిషేక్, సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఒ పి.అంబేద్కర్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్ నంద్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-గొలుగొండ : యూటీఎఫ్ సభ్యత్వ క్యాంపెయిన్‌లో భాగంగా శుక్రవారర మండలంలో పలు హైస్కూల్స్‌ను యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో సందర్శించారు. విద్యా వ్యవస్థలో జరుగుతున్న అనేక విషయాల మీద ఉపాధ్యాయులతో చర్చిస్తూ సభ్యత్వ క్యాంపెయిన్ కొనసాగింది. ముఖ్యంగా సిపిఎస్ రద్దు చేస్తానని గద్దెనెక్కిన ప్రభుత్వం రద్దు చేయకపోగా, జిపిఎస్ అనే గుదిబండను ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల మీద మోపిందని ఆరోపించారు. ఉపాధ్యాయులు ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో ఉత్తేజితులై, ఢిల్లీ రైతు ఉద్యమం తరహాలో పోరాడేందుకు ముందుకు రావాలన్నారు. అధ్యయనం,అధ్యాపనం సామాజిక స్పృహలో భాగంగా సమాజంలో జరుగుతున్న అన్ని విషయాలను కూలంకషంగా అధ్యయనం చేసి సమాజాన్ని చైతన్యం చేయడమే యుటిఎఫ్ నినాదమన్నారు అనంతరం అల్లూరి సీతారామరాజు సమాధిని సందర్శించి పూలమాలలు వేసి నివాళు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు గాయత్రి, మండల అధ్యక్షులు కోడి రాజబాబు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు చిట్టియ్య, శోభన్, చిట్ల అప్పారావు స్పర్జన్‌రాజు పాల్గొన్నారు.



ఆయుర్వేద ఆసుపత్రిని ప్రారంభిస్తున్న జమాల్ ఖాన్

ఆయుర్వేద వైద్యాలయాన్ని ప్రారంభించిన జమాల్ ఖాన్

ప్రజాశక్తి-చింతూరు : నెల్లూరులో జేమ్స్ గార్డెన్ వద్ద నెలకొల్పిన సుభాని ఆయుర్వేద వైద్యాలయాన్ని శుక్రవారం చింతూరు మండలం నిమ్మలగూడెం గ్రామానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ ప్రపంచంలో రోజు రోజుకు పెరిగిపోతున్న రోగుల పట్ల ఆయుర్వేద వైద్యులు అందిస్తున్న సేవలను కొనియాడారు. రాబోయే తరాలకు ఆయుర్వేదమే ఆయువుపట్టు కానుందని తెలిపారు. ఈరోజు ప్రారంభించిన సంజీవని ఆయుర్వేద వైద్యాలయం రోగులకు మెరుగైన చికిత్సలు అందిస్తూ పేరు ప్రఖ్యాతలు పొందాలని కోరారు. అనంతరం జమాల్ ఖాన్‌ను ఆయుర్వేద వైద్యులు కాజా మస్తాన్, అతిధులు మహమ్మద్ రఫీ, భవాని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సంజీవిని ఆయుర్వేద సిబ్బంది, శేఖర్, భవాని, నెల్లూరు ఆయుర్వేద వైద్యులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - రంపచోడవరం : వన్య పాణి వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఫోక్స్‌పేట అటవీ రేంజ్ అధికారులు రంపచోడవరం మండలం కె ఎర్రంపాలెం గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు జూనియర్, సీనియర్ విభాగాల వారీగా నిర్వహించారు. విభాగాల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన బాలికలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు నరసమ్మ, ప్రేమలత, రత్నమ్మ పాల్గొన్నారు.

24వ రోజుకు టిడిపి దీక్షలు

ప్రజాశక్తి-రంపచోడవరం : టిడిపి అధినేత చంద్రబాబుకు మద్దతుగా రంపచోడవరంలో తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 24వ రోజుకు చేరాయి. టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్ దీక్షల్లో కూర్చున్న వారికి పూలదండలు వేసి 24వ రోజు దీక్షలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కారం సురేష్ బాబు, పాము అర్జున్, మరిచెట్ల వెంకటేశ్వరరావు, పెంటపాటి అనంత మోహన్, మట్ట మేహర్‌బాబా గౌడ్, జెఎస్.నగేష్, అడబాల బాపిరాజు, వై.నిరంజని దేవి, తైలం గంగాధర రావు, సిద్దా వెంకన్న దొర, ఇతర నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ క్లిక్‌పై దాడిని ఖండిస్తూ..

జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్వతంత్ర ఆన్‌లైన్ పోర్టల్ న్యూస్ క్లిక్‌పై మోడీ సర్కారు ఉక్కుపాదం మోపడాన్ని ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు విశాఖ నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. మీడియా స్వేచ్ఛపై దాడి సిగ్గు సిగ్గు, జర్నలిస్టుల గొంతు నొక్కడం దుర్మార్గం, న్యూస్ క్లిక్‌పై దాడి మీడియా స్వేచ్ఛకు భంగం అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ మీడియా స్వేచ్ఛను అరికట్టడం ప్రజాస్వామ్యంలో తగదని అన్నారు. ఢిల్లీలో న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ సహా మరికొంతమంది జర్నలిస్టులను అరెస్టు చేయడం సరికాదన్నారు. ఇది మీడియా స్వేచ్ఛను హరించినట్లు అవుతుందన్నారు. మీడియాలో ప్రతికూల వార్తలు వచ్చిన సందర్భంలో ఇతర మార్గాల ద్వారా తమ అసంతృప్తిని తెలియజేయవచ్చని అన్నారు. ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు పోతుమహంతి నారాయణ్ మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛలో దేశం స్థానం 16కి పడిపోవడం పత్రికల దుస్థితిని తెలియజేస్తోందన్నారు. పాత్రికేయుల పట్ల సమాజం సానుకూలంగా ఉండాలని అన్నారు. జిల్లా నాయకులు ఎస్.మధుసూదనరావు మాట్లాడుతూ న్యూస్ క్లిక్‌పై దాడిని ఖండించారు. జర్నలిస్టుల ఇళ్లపై దాడులు చేసి ల్యాప్‌టాప్స్, మొబైల్ ఫోన్లను పోలీసులు లాక్కోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ న్యూస్‌క్లిక్‌పై బిజెపి ప్రభుత్వం అసత్య ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. ఉపా చట్టం కింద నేరపూరిత కుట్రలకు పాల్పడుతూ పలు కేసులు పెట్టడం గర్హనీయమన్నారు. ప్రభుత్వానికి ఇష్టం లేని వార్తలు ప్రసారం చేస్తున్నందునే ప్రముఖ పాత్రికేయుడు, రచయిత ప్రబీర్ పుర్కాయస్థ నేతృత్వంలో నడుస్తున్న ఆ పోర్టల్‌పై ఆరోపణలు చేస్తూ అక్రమ కేసులతో వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వ నిరంకుశ విధానాలు, మీడియాపై దాడులు, వేధింపుల వల్ల ఇప్పటికే దేశం ప్రపంచ పత్రికా స్వాతంత్ర్యంలో అట్టడుగు స్థాయికి చేరిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రవికుమార్, ఎపిబిజెఎ జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, ఫెడరేషన్ జిల్లా నాయకులు కోడూరు అప్పలనాయుడు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

చెట్టు కూలడంతో రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్‌లోని రైన్‌గేజ్ సమీపంలో ప్రధాన రహదారికి అడ్డంగా చెట్టు కూలి పోవడంతో శుక్రవారం తెల్లవారుజామున వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తెల్లవారుజామున ఐదు గంటలకు సీలేరు మీదుగా పాడేరు వెళ్లే బస్సు చెట్టు కొమ్మలు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో ఆ బస్సులోని ప్రయాణికులు దిగి చెట్టుకొమ్మలు గట్టిగా లాగే వెనక్కి పట్టుకోవడంతో బస్సు ముందుకు వచ్చింది. ఇలాగే ప్రతి వాహనం రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ప్రధాన రహదారిలో ఎప్పటికప్పుడు చెట్లు పడిపోతుండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రహదారిని ఎప్పటికప్పుడు పరివేక్షించి రవాణా సౌకర్యానికి ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ

ప్రజాశక్తి-విఆర్.పురం

మండల కేంద్రం రేఖపల్లిలో ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులపై ప్రణాళిక కోసం ఆ గ్రామ సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ పూనెం సరోజిని అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఎపిఒ రాఘవయ్య మాట్లాడుతూ ఈ ఏడాది ఉపాధి హామీ పనులు అందరికీ కల్పించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. జాబ్ కార్డును బ్యాంకు ఖాతాకు లింక్ చేసుకోవాలన్నారు. ఈ గ్రామసభలో రేఖపల్లి ఎంపిటిసి బంధం విజయలక్ష్మి, ఉపసర్పంచ్ లక్ష్మణ్, కార్యదర్శి శివప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ కె.వర్మ శేఖర్ రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ బుచ్చిరాజు, ఎన్ఆర్ఇజిఎస్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ సరోజిని

పోలీసులపై దాడి చేసిన ఆర్మీ ఉద్యోగి అరెస్ట్

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఎస్ఐ, ఎఎస్ఐ, ఇద్దరు పోలీసు సిబ్బందిపై దాడి చేసి గాయపరచిన ఒక ఆర్మీ ఉద్యోగిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ శుక్రవారం సాయంత్రం తెలిపారు. వివరాలివి. మేడివాడ గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి గొర్లె భాస్కరరావుకు అదే గ్రామానికి చెందిన పతివాడ కోటేశ్వరరావు సరిహద్దు భూవివాదాలున్నా యి. పలుమార్లు గొడవ పడటంతో తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 5 భాస్కరరావు కత్తితో కోటేశ్వరరావు ఇంటికి వెళ్లగా, వారు భయంతో 112 ఫోన్ చేశారు. దీంతో రావికమతం ఎఎస్ఐ అప్పారావు, మరో ఇద్దరు కానిస్టేబుల్స్ వెళ్లగా, ఆర్మీ ఉద్యోగి భాస్కరరావు వారిపైనా తిరగబడటంతో తిరిగి వెళ్లిపోయారు. జరిగిన సంఘటనను ఎస్ఐ ఉమామహేశ్వరరావుకు వివరించడంతో ఎస్ఐ వారి వాగ్మూలంతో భాస్కరరావుపై కేసు నమోదు చేశారు. శుక్రవారం భాస్కరరావును అరెస్ట్ చేసేందుకు ఎస్ఐ ఉమా మహేశ్వరరావు, ఎఎస్ఐ అప్పారావు, హెచ్‌సి శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వెళ్లగా సదరు ఆర్మీ ఉద్యోగి ఎస్ఐతో పాటు సిబ్బందిపైనా దాడిచేశాడు. ఈ దాడిలో ఎస్ఐ మోచేతిపై గట్టిగా కొరికి గాయపరిచాడు. ఎఎస్ఐ అప్పారావుకూ, హెచ్‌సి శ్రీనివాస్‌లకూ గాయాలయ్యా యి. సమాచారం తెలుసుకున్న కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ కొత్తకోట, బుచ్చెయ్యపేట సిబ్బంది తో హుటాహుటీన మేడివాడ చేరుకొని దాడికి పాల్పడిన ఆర్మీ ఉద్యోగి భా స్కరరావును అదుపులోకి తీసుకున్నారు. గాయాలపాలైన ఎస్ఐ ఉమామహేశ్వరరావుకు సిబ్బందికి చికిత్స చేయించారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని కొమరవోలు పంచాయతీ రెవెన్యూలో 66 సర్వే నెంబరులో కొమరవోలు ఆవకు సంబంధించిన ప్రభుత్వ స్థలాన్ని, ఉపాధి హామీ పథకంలో వేసిన గట్టును కొమరవోలు గ్రామానికి చెందిన కన్నూరు నానిబాబు, కన్నూరు అప్పలనాయుడు, కన్నూరు పార్వతి ఆక్రమించుకున్నారని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు అదే గ్రామానికి చెందిన కన్నూరు శ్రీనివాస్ తెలిపారు. ఆక్రమించి మొక్కలు వేసి, రహదారిని దిగ్బంధం చేసి కంచె వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - రావికమతం :మండలంలోని గర్నికం పంచాయతీ శివారు కానాడ రోడ్డు పనులను ఎంపిపి పైలరాజు ఆధ్వర్యంలో మండల నాయకులు శుక్రవారం పరిశీలించారు. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు దుస్థితిపై గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి ఎంపి సత్యవతి, తన ఎమ్మెల్యే కోటా నిధులను ఇస్తామన్న హామీ మేరకు నిధులు మంజూరు చేయగా, పనులు చురుగ్గా సాగుతున్నాయి. మేడివాడ నుంచి కానాడకు వెళ్లే రోడ్డు పనులను మండల నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. నాణ్యతతో పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు కార్యక్రమంలో గర్నికం సర్పంచు నూకరాజు, మండల కన్వీనర్ కె. జగన్నాథరావు, మండల మాజీ ఉపాధ్యక్షులు గంటా ఈశ్వరరావు, మాణిక్యం, సత్తిబాబు, గణేష్ , రమణబాబు పాల్గొన్నారు.

రేడియేషన్ ప్రభావంపై పరిశోధనకు అవకాశాలు

ప్రజాశక్తి-మధురవాడ : వైద్య ఆరోగ్య రంగం నుంచి అంతరిక్ష రంగం వరకు మానవ ఆరోగ్యంపై రేడియేషన్ ప్రభావం ఏవిధంగా ఉందో అధ్యయనం చేయడానికి పరిశోధనలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ముంబైలోని బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం మెడికల్ గ్రూప్ అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ కె.భల్వీందర్ కె.సప్ర పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మానవ ఆరోగ్యంపై రేడియేషన్ ప్రభావం, పరిశోధన అవకాశాలపై ఆమె ప్రసంగించారు. వాతావరణంలో ఉండే రేడియేషన్ మానవ ఆరోగ్యంపై పెద్దగా ప్రభావం చూపదని అయితే కేన్సర్ చికిత్స, ఎక్స్‌రేల వినియోగంలో జరిగే రేడియేషన్‌పై తాము అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. గగన్ యాన్ అంతరిక్ష ప్రయోగంలో వ్యోమగామిపై రేడియేషన్ ప్రభావం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధ్యయనం చేసే అవకాశం తమకు లభించిందన్నారు. అణుభౌతిక శాస్త్రం అభ్యసించే విద్యార్థులకు ఈ రంగంలో పరిశోధనకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. బార్క్‌లోని తమ విభాగం పలు శిక్షణ కార్యక్రమాలతో పాటు డిప్లమో కోర్సులను నిర్వహిస్తోందని, వాటిని పూర్తి చేసిన వారికి దేశ విదేశాలలో ఉద్యోగఅవకాశాలు లభిస్తున్నాయని వివరించారు. కార్యక్రమానికి గీతం జీవ శాస్త్ర విభాగాల విశిష్ట ప్రొఫెసర్ హరిమిశ్ర అధ్యక్షత వహించారు.



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటలక్ష్మి

సిసి డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని మూలపేట గ్రామంలో సీసీ డ్రైనేజీల నిర్మాణానికి స్థానిక సర్పంచ్ రావుల వెంకట లక్ష్మీ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నీలాపు సూరిబాబు, రావుల సింహాచలం, పొట్టిక పోతురాజు, ఉప సర్పంచ్, మాజీ ఉప సర్పంచ్, సచివాలయం కన్వీనర్ నీలాపు నూకరాజు, దుంప రాజుబాబు, బుక్క చంటి, మాజీ ఎంపీటీసీ బిత్తరి కళ్యాణం, పంచాయతీ కార్యదర్శి రవీంద్ర, గ్రామం పెద్దలు పాల్గొన్నారు.

తామరపల్లిలో 'పశు విజ్ఞాన బడి'

ప్రజాశక్తి రంపచోడవరం : మండలంలోని తామరపల్లి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో ముసురుమిల్లి ఎంపీటీసీ సభ్యులు వంశి కుంజం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రాంతంలో ఆవు నుంచి పాలు చాలా తక్కువ మంది తీస్తారాని, దాని మీద దృష్టి సారిచాలని సూచించారు. డిప్యూటీ డైరెక్టర్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ పశువుల వల్ల చాలా లాభాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ అబ్బులు, గృహ సారధి చిరంజీవి, డాక్టర్ గోపిక, రికీరాయ్, వెటర్నరీ అసిస్టెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేటగాళ్ల బాణాలకు అడవి గేదె మృతి

ప్రజాశక్తి -మారేడుమిల్లి : మండలంలో గాలిగోపురం సమీపంలో వేటగాళ్ల చేతిలో అడవి దున్న మరణించింది. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సుమంత్ తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం మారేడుమిల్లి గ్రామ సమీపంలోని గాలిగోపురం వద్ద కొంతమంది గిరిజనులు అటుగా వెళుతూ మరణించిన అడవి గేదెను చూసి సంబంధిత అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అటవీ శాఖ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకొని పశు వైద్యాధికారులతో పంచనామం నిర్వహించారు. అనంతరం ఆ గేదెను అక్కడే ఖననం చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఫారెస్ట్ సెక్షన్ అధికారి సుమంత్ తెలిపారు.

చర్చి ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన చర్చిని నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసిరెడ్డి శివప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ యేసు మార్గంలో అందరూ నడవాలని, ప్రార్థించే ప్రతి కుటుంబానికి స్వస్థత జరగాలని కోరారు. అనంతరం చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్ధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, యవనస్తులు పాల్గొన్నారు.

5 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలంలోని సూరేంద్రపాలెం గ్రామ శివారుల్లో 5 లీటర్ల నాటుసారాతో ఉన్న వ్యక్తిని అరెస్టు చేశామని, ఆ సారాను స్వాధీనం చేసుకున్నట్లు కొయ్యూరు ఎస్సై రాజారావు తెలిపారు. ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించగా, పాటి పెంటయ్య అనే వ్యక్తి సూరేంద్రపాలెం గ్రామ శివారులలో నాటుసారా తయారు చేసి, విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో పట్టుకున్నట్లు తెలిపారు. మండలంలో నాటుసారా నిర్మూలనకు చర్యలు చేపట్టామని, ఎవరైనా నాటుసారా క్రయ విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.